

కడచూపునకు.. తోడ్పాటు



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని పార్థివ వాహనం

అప్పటి వరకు మనతో ఉన్న వారైనా సరే.. చనిపోతే వారి దగ్గరికి వెళ్లేందుకు సంశయిస్తాం. వెనుకడుగు వేస్తాం. ఆస్పత్రుల్లో చనిపోతే మృతదేహాలను ఇళ్లకు తీసుకెళ్లేందుకు ప్రైవేటు వాహనాల వారు వేల రూపాయలు డిమాండ్ చేస్తారు. అదేమంటే శవాన్ని తీసుకెళ్తే తమకు చాలా రోజుల వరకు గిరాకీలు రావని, వాహనం వాసనతో పాడవుతుందని, శుభ్రం చేసుకోవడానికి కష్టమవుతుందని సాకులు చెబుతారు. మరి డబ్బులు లేని వారి పరిస్థితి ఏంటి?.. ఇలా ఆలోచించే గత సర్కారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చనిపోయిన వారిని ఇళ్లకు ఉచితంగా చేర్చేందుకు పార్థివ వాహనాలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికైనా సరే ఈ వాహనాల్లో మృతదేహాలను వారి ఇళ్లకు చేరుస్తారు.
ఈ వాహనాల రాకతో నిరుపేదల కడచూపునకు తోడ్పాటు అందించినట్లయ్యింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వాహనాలు ఏడాదిలో 3,884 మందికి సేవలందించాయి.

- మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), (ఆంధ్రజ్యోతి)

మృతదేహాలను ఇళ్లకు చేర్చుతున్న పార్థివ వాహనాలు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో చనిపోతే ఉచితంగా సేవలు
- తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా..
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4 వాహనాలు
- ఏడాదిలో 3,884 మందికి సేవలు

పార్థివ వాహనాలతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చనిపోయిన వారి మృతదేహాలను ఉచితంగా ఇళ్లకు చేరుస్తున్నారు. ఆస్పత్రుల్లో ఎవరైనా చనిపోతే ఆ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వాహనదారులు ఎవరూ ముందుకు వచ్చే వారు కాదు. ఒకవేళ వచ్చినా దూరాన్ని బట్టి రూ.5,000 నుంచి రూ.10,000 వరకు చార్జీ తీసుకునేవారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని పార్థివ వాహన సేవలను అప్పటి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. 2016 నవంబరు 18న అప్పటి ప్రభుత్వం ఒక్కో జిల్లాకు ఒక్కటి చొప్పున నారాయణపేటను మినహాయించి, ఉమ్మడి జిల్లాకు నాలుగు వాహనాలను మంజూరు చేసింది. అప్పట్లో నారాయణపేట జిల్లా కాకపోవడంతో దానికి ఇవ్వలేదు. ఈ వాహనాల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎవరైనా చనిపోతే ఉచితంగా వారి ఇంటికి తీసుకెళతారు.

మహబూబ్‌నగర్‌లో 1,425 పార్థివ దేహాల చేరవేత

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చనిపోయిన వారిని పార్థివ వాహనాల

(మిగతా 6లో..)

బయట అంబులెన్స్‌ల వారు రూ.6 వేలు అడిగారు



మాది నారాయణపేట జిల్లా పెద్ద జట్రం గ్రామం. నెల రోజుల క్రితం మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో మా పెద్దమ్మ చనిపోయింది. మృతదేహాన్ని మా ఊరికి తీసుకెళ్లడానికి బయట ప్రైవేటు వాహనాల వాళ్లు రూ.6 వేలు అడిగారు. అంత డబ్బు లేక పోవడంతో ఆసుపత్రి ఆర్ఎంవోను కలిశాం. వాళ్లే పార్థివ వాహనానికి ఫోన్ చేసి మా పెద్దమ్మ మృతదేహాన్ని ఉచితంగా వాహనంలో ఊరికి తెచ్చారు.

- కిరణ్, పెద్దజట్రం గ్రామం

ఒక్క ఫోన్ చేస్తే చాలు..



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో మృతదేహాలను తరలించేందుకు పార్థివ వాహనాలను ఏర్పాటు చేశాం. ఎవరైన ఆసుపత్రిలో చనిపోతే ఆర్ఎంవోను సంప్రదిస్తే వారు ఫోన్ చేస్తారు. ఫోన్ చేసిన వెంటనే మేము వాహనాన్ని పంపిస్తాం.

- రవికుమార్, జీవీకే ఈఎంఆర్ఐ అంబులెన్స్ సర్వీసుల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త



కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

పదిలో మంచి మార్కులు సాధించాలి

కలెక్టర్ విజయేందిర బోయి

- భూత్పూర్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల తనిఖీ
- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి కుటుంబ సభ్యులకు ఓదార్పు

భూత్పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, వందకు వంద శాతం ఉత్తీర్ణత తేవాలని కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. శనివారం ఆమె భూత్పూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. బాలికలతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని, భోజనం మెనూ ప్రకారం ఇస్తున్నారా? అని బాలికలను అడిగారు. ఉపాధ్యాయులు పాఠశాలకు రోజూ రావాలని, సబ్జెక్టు పరంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని చెప్పారు. పాఠశాల నిర్వహణపై శ్రద్ధ పెట్టాలన్నారు. పారిశుధ్యం, విద్యార్థుల ఆరోగ్యం, భోజన విషయంలో సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కిషన్, జీపీవో వెంకట్‌రెడ్డి ఉన్నారు.

సతీష్‌రెడ్డికి శ్రద్ధాంజలి

కొత్తకోట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూసాపేట మండలం వేముల గ్రామ పంచాయితీ కార్యదర్శి సతీష్‌రెడ్డి మృతి చెందాడు. కలెక్టర్ శనివారం వారి ఇంటికి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సతీష్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇచ్చారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన బెనిఫిట్లను సకాలంలో అందేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, పంచాయతీ కార్యాదర్శులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

- సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ వాణిశ్రీ
- ముగిసిన 11వ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్



టెన్నికాయిట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జడ్చర్ల మండలం చిట్టెబోయిన్‌పల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల జట్టుకు బహుమతి అందిస్తున్న డీసీవో వాణిశ్రీ, ప్రిన్సిపాల్ అనిత

జడ్చర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో పాటు అన్ని రంగాలలో విద్యార్థినులు రాణించాలని సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ వాణిశ్రీ అన్నారు. జడ్చర్ల మండలంలోని చిట్టెబోయిన్ పల్లి సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన 11వ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. అనంతరం విజేలతకు బహుమతులను అందచేశారు. బాల్‌బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీల్లో చిట్టెబోయిన్‌పల్లి పాఠశాల విద్యార్థినులు ప్రథమస్థానంలో నిలిచారు. జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. అండర్-14 విభాగంలో వ్యక్తిగతంగా ఓవర్‌ఆల్ చాంపియన్‌షిప్ ఎను మరికల్ పాఠశాలకు చెందిన అక్షయ నిలిచింది. అలాగే అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సైతం మరికల్ పాఠశాల జట్టు సాధించారు. గేమ్స్‌లో ఓవరాల్ చాంపియన్‌గా నంచెర్ల పాఠశాల, గేమ్స్ అండ్ అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా మరికల్ పాఠశాల నిలిచింది. అండర్-17 విభాగంలో అథ్లెటిక్స్‌లో వ్యక్తిగతంగా ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నంచెర్ల పాఠశాల విద్యార్థి అక్షయ నిలిచింది. అథ్లెటిక్స్ అండ్ గేమ్స్‌లో ఓవరాల్ చాంపియన్‌గా నంచెర్ల పాఠశాల జట్టు నిలిచింది. అండర్-19 విభాగంలో వ్యక్తిగత ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను నంచెర్ల పాఠశాల విద్యార్థి లావణ్య సాధించింది. అలాగే అథ్లెటిక్స్ అండ్ గేమ్స్‌లలో సైతం ఓవరాల్ చాంపియన్‌గా నంచెర్ల పాఠశాల జట్టు నిలిచింది. ప్రిన్సిపాల్ అనితతో పాటు పోటీలలో పాల్గొన్న పాఠశాలల ప్రిన్సిపాల్స్ మణిమాల, మంజుల, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ షంషేర్‌అలీ, పీఈటీలు శరణ్య, ఉమ, స్వరూప, యాదమ్మ, లావణ్యతో పాటు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ విద్యావతి, రాజేశ్వరీ, ఉపాధ్యాయులు భవానీ, శ్రీదేవి, కవిత, స్రవంతి, మాధవి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేట మండలం శాసన్‌పల్లిలో వరి పంట కోస్తున్న హార్వెస్టర్

జోరందుకున్న వరి కోతలు

- హార్వెస్టర్లకు డిమాండ్
- నారాయణపేట జిల్లాలో 1.77 లక్షల ఎకరాల్లో సాగు

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నారాయణపేట జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయి. అధిక వర్షాలతో పత్తి, కంది పంటలు దెబ్బతిన్నాయి. తెగుళ్ల వల్ల దిగుబడి సగానికి పడిపోయింది. వరి సైతం అక్కడక్కడ నేలకొరిగి నష్టం జరిగింది. జిల్లాలోని సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్‌లతో పాటు కృష్ణానది పరివాహక ప్రాంతాలు, చెరువుల కింద పంట ప్రస్తుతం కోతదశకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా 1.77 లక్షల ఎకరాల్లో ఈ వానాకాలంలో వరి నాటారు. అందులో సన్నరకం 1,40,205 ఎకరాల్లో వేయగా, దొడ్డు రకం హంసలు 37,453 ఎకరాల్లో వేశారు. వరి కోత యంత్రాలకు గంటకు రూ.2,800 నుంచి రూ.3,000 వరకు అద్దె తీసుకుంటున్నారు. ఒకేసారి అందరూ పంటల కోయిస్తుండటంతో యాంత్రాలకు డిమాండ్ నెలకొంది.

మద్దతు ధర రూ.2,389

ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2,389 మద్దతు ధర నిర్ణయించింది. గ్రేడ్ 'సి'కి రూ.2,369 ధర ఉంది. సన్న రకాలకు క్వింటాలుపై అదనంగా రూ.500 బోనస్ చెల్లించనున్నారు. జిల్లాలో 4,28,838 మెట్రిక్ ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందులో సన్న రకం ధ్యానం 3,32,589 మెట్రిక్ టన్నులు కాగా, దొడ్డు రకం 96,249 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేశారు.

సోమశిలకు సినీ నటుడు అల్లు అర్జున్



కృష్ణానది వద్ద లాంచీలోంచి దిగుతున్న అల్లు అర్జున్

- కుటుంబ సభ్యులు, చిన్ననాటి మిత్రులతో కలిసి కృష్ణానది అందాల వీక్షణ 7
- నదిలో బోటింగ్ చేసిన హీరో
- పుష్ప కోసం సోమశిలకు పరుగెత్తిన అభిమానులు
- అప్పటికే వెళ్లిపోయిన నటుడు

జడ్చర్లలో నకిలీ నోట్ల కలకలం

- ఓ కిరాణ దుకాణంలో రెండు రోజులుగా రూ.500 నోట్లతో సిగరెట్లు కొంటున్న ఓ యువకుడు 6
- పట్టుకున్న కాలనీ వాసులు.. పోలీసులకు అప్పగింత

ఒకే చోట ఏడు వానకోయిల పాములు

6

అక్కమహాదేవి గుహల సందర్శనకు మరో లాంచీ

- ఇప్పటి వరకు ఉన్నది ఒక్కటే..
- గుహల సందర్శనకు రాను పోను సుమారు మూడు గంటల సమయం
- తర్వాత వచ్చిన వారు ఎదురు చూడకుండా మరొకటి ఏర్పాటు 6

ముగిసిన జోనల్ క్రీడలు

- పాల్గొన్న 13 గురుకుల పాఠశాలలు, కళాశాలల 1,105 మంది విద్యార్థులు 6

ఆద్య గాత్రం.. వినసొంపైన వి'చిత్రం'!



డబ్బింగ్ చెబుతున్న ఆద్య హనుమంతు(ఫైల్)

- హీరోయిన్ సాయి పల్లవి గాత్రం వెనుక పాలమూరు గొంతుక 7
- ఇప్పటి వరకు 187 సినిమాల్లో 34 మంది హీరోయిన్లకు డబ్బింగ్
- పాలమూరులో స్టూడియో ఏర్పాటు.. 15 నుంచి తరగతులు



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

గోవిందా గోవింద

- కురుమూర్తికి పోటెత్తిన భక్తజనం

చిన్నచింతకుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలో వెలిసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం భక్తులు పోటెత్తారు. గోవింద నామ స్మరణతో కొండలు మారుమోగాయి. ఉద్దాల ఉత్సవాన్ని తలపించేలా భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచీ తరలొచ్చారు. స్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు జాతరలో కొనుగోళ్లు చేశారు. గాజులు, మిఠాయి, కుంకుమ దుకాణాలు, రంగుల రాట్నాల వద్ద జనం అధిక సంఖ్యలో కనిపించారు.



స్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 122.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

సెమీ ఫైనల్‌కు మహబూబ్‌నగర్

- బాల, బాలికల జట్లు ఎంపిక
- కోస్గిలో హోరాహోరీగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



తలపడుతున్న కరీంనగర్-వరంగల్ జట్లు

కోస్గి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కోస్గి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో రాష్ట్ర స్థాయి అండర్-17 హ్యాండ్ బాల్ క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జట్లు గెలుపొంది సెమీఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వరంగల్ జట్లు విజయం సాధించాయని నిర్వాహకులు వెల్లడించారు.

ఎమ్మెల్యే స్పందించాలి

- వివాదాస్పద స్థలాన్ని పరిరక్షించాలి
- మహమ్మదాబాద్‌లో గ్రామస్థుల వంటావార్పు




రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

మహమ్మదాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని నవజీవన రిక్రియేషన్ క్లబ్ స్థల సమస్యపై ఎమ్మెల్యే స్పందించి, పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. క్లబ్ స్థలానికి రక్షణ కల్పించాలని గ్రామస్థులు, యువజన సంఘాలు చేస్తున్న నిరసనలు కొనసాగుతున్నాయి. శనివారం జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై గ్రామస్థులు బైఠాయించి, వంటావార్పు చేశారు. అక్కడే భోజనాలు తిన్నారు. ఈ సందర్భంగా మహమ్మదాబాద్ మాజీ ఎంపీటీసీ గుల్ల చెన్నయ్య, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, దిడ్డికాడి గోపాల్ మాట్లాడుతూ 40 ఏళ్ల కింద ఉపాధ్యాయులు, ఉద్యోగులు క్లబ్ నిర్మాణం కోసం చందాలు పోగుచేసి స్థలం తీసుకున్నారన్నారు. క్లబ్ కోసం భవనం నిర్మించారన్నారు. అలాంటి భవనాన్ని అక్రమంగా కూల్చడం సరికాదన్నారు. అంతకు ముందు బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొత్త నర్సిములు, మాజీ సర్పంచ్ గీతా పాండు, పవన్‌కుమార్, ముస నర్సిములు, దస్తయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్ఐ వినూత్న నిరసన

▸ బెనిఫిట్స్ రాలేదంటూ విద్యుత్ స్తంభానికి కట్టిన ప్లకార్డు



విద్యుత్ స్తంభానికి కట్టిన ప్లకార్డు

వనపర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ పొందిన ఓ ఏఎస్ఐ తనకు రావాల్సిన బెనిఫిట్స్ రావడం లేదని ప్లకార్డు కట్టి వినూత్న నిరసన వ్యక్తం చేసిన ఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ అహ్మద్ హుస్సేన్ పేరుతో శనివారం మధ్యాహ్నం పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో విద్యుత్ స్తంభానికి ఓ ప్లకార్డు కట్టి ఉంది. అటు వైపు నుంచి వెళ్తున్న పలువురు దగ్గరికి వెళ్లి చూడగా అందులో తనకు రావాల్సిన బెనిఫిట్స్ గురించి రాసి ఉంది. "నేను పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి 31-05-2020న పదవీ విరమణ పొందాను.. నాకు రావాల్సిన ఎన్క్యాష్మెంట్ బిల్(ఈఎల్)2022లో ఈ కుబేర్‌లో క్యాన్సల్ అయినది.. మళ్లీ 2023 ఫిబ్రవరిలో కొత్త టోకెన్ అధికారులు ఈ కుబేర్‌కు పంపారు.. కానీ ఇప్పటి వరకు నాకు రావాల్సిన రూ.2 లక్షల 20వేల 366 బిల్ పాస్‌కాలేదు" అని రాశారు. వెంటనే ముఖ్యమంత్రి మా యొక్క పెండింగ్ బిల్స్ పాస్ చేయించాలని దాంట్లో విన్నవించారు.

ఈ విషయంపై ఆంధ్రజ్యోతి ఏఎస్ఐ మహమ్మద్ హుస్సేన్‌తో ఫోన్‌లో మాట్లాడగా, పదవీ విరమణ పొంది 5 సంవత్సరాలు అవుతుందని, ఇప్పటి వరకు మా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ విధంగా నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం బయట అప్పు తీసుకున్నానని, ఆ డబ్బులు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చొరవ తీసుకుని మా బెనిఫిట్స్ మాకు అందజేయాలని కోరారు.

నేడు ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజ్‌గిరి ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న 8వ రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళలు, పురుషుల జట్ల ఎంపికలు ఆదివారం స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్‌హనీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు పురుషులు కోచ్ పర్వేజ్, మహిళలు ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్యకు రిపోర్టు చేయాలని కోరారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొనే మహబూబ్‌నగర్ జిల్లా బాల,బాలికల జట్ల ఎంపికలను ఆదివారం ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డుతో మధ్యాహ్నం 12 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జరిమానా

ఊర్కొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కల్వకుర్తి కోర్టులో హాజరుపరుచగా న్యాయాధికారి జరిమానా విధించినట్లు ఎస్ఐ కృష్ణదేవ శనివారం తెలిపారు. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సాంబ మల్లేష్‌కు రూ.1000, కె.శేఖర్‌రెడ్డికి రూ.1100, మాదారం గ్రామానికి చెందిన ఎన్.వెంకటేష్‌కు రూ.1100, ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన ఏ.మల్లయ్యకు రూ.1200 జరిమానా కల్వకుర్తి కోర్టు న్యాయాధికారి విధించారని తెలిపారు.

బ్రిడ్జిపై తేలిన సీకులు


బిజినేపల్లిలోని కేఎల్ఐ కాలువ బ్రిడ్జిపై ప్రమాదకరంగా తేలిన సీకులు

బిజినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బిజినేపల్లి నుంచి వనపర్తి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కేఎల్ఐ కాలువపై ఉన్న బ్రిడ్జి సీకులు పూర్తిగా బయటకు తేలాయి. దీని పర్యవసానగా బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం కేఎల్ఐ ప్రాజెక్టు గుత్తేదారులు బ్రిడ్జి నిర్మాణం పనులను నిర్లక్ష్యంతో నాణ్యతలేని సిమెంట్, ఇసుక, కాంక్రీట్ వినియోగించడం తోనే పెచ్చులూడి సీకులు బయటకు వచ్చాయని పలువురు విమర్శిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిపారుదల, ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి బయటకు తేలిన సీకులపై కాంక్రీట్ వేసి, వాహనదారులకు ఎలాంటి ప్రమాదం జరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో కారు దగ్ధం


తగులబడిన కారు ఇదే..

బ్రహ్మగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఘట్ రోడ్డులో ప్రమాదవశాత్తు కారు తగులబడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. బ్రహ్మగిరి ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ చిక్కడిపల్లికి చెందిన ప్రణవ్‌కుమార్ ఆరుగురు కుటుంబ సభ్యులతో కలిసి పార్చునర్ కారులో శ్రీశైలం వెళ్తున్నారు. కృష్ణగిరి కృష్ణవేణి అతిథి గృహం సమీపంలో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే, కారులో ఉన్న ఆరుగురు క్షేమంగా బయటపడటంతో ప్రాణాపాయం తప్పిందని ఎస్ఐ తెలిపారు. జెన్‌కో ఫైర్ ఇంజన్‌తో తమ సిబ్బంది మంటలు ఆర్పుతున్నప్పటికీ అప్పటికే కారు పూర్తిగా కాలిపోయిందని తెలిపారు.

రారెత్తిస్తున్న రోడ్డు టెర్రర్

▸ వరుస ప్రమాదాలతో ప్రజల ఆందోళన
▸ అతివేగం, అజాగ్రత్త, మద్యం మత్తులోనే ప్రమాదాలు
▸ తూతూ మంత్రంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి చికిత్స చేయిస్తున్న దృశ్యం(ఫైల్)

గద్వాల క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. జిల్లాలోని నేషనల్ హైవేలతో పాటు ఇతర రహదారులు కూడా రక్తచిద్రమౌతున్నాయి. ఎక్కువగా మద్యం మత్తుతో పాటు అతివేగం, అజాగ్రత్తతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పకనే చెప్పవచ్చు. రోడ్డు ప్రమాదాలతో జిల్లాలోని ప్రజలు ఆందోళనకు గురౌతున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఇటీవలే జరిగిన ప్రమాదాలు ఇవే....

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో మీనాక్షి లాడ్జ్ ఎదురుగా జమ్మిచేడు నుంచి గద్వాల వస్తున్న ముగ్గురు యువకులు అతివేగం, అజాగ్రత్తతో వాహనాన్ని నడపడటంతో అది రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో నాగరాజు, నరేష్ మృతిచెందగా, మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డారు. వీరు ఫుల్‌గా మద్యం సేవించి వాహనం నడిపినట్లు తెలుస్తున్నది. అలాగే వడ్డేపల్లి మండలం జూలకల్ స్టేజీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. ఈ సంఘటనలో లారీ, ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.

అలాగే గత నెల 13న గద్వాల పట్టణంలోని అయిజ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న విషయం తెలిసిందే. గద్వాల దౌదర్‌పల్లికి చెందిన విజయ్ అనే వ్యక్తి బైక్‌పై అతివేగం, మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న పులికల్‌కు చెందిన శ్రీనివాసులు బైక్‌ను ఢీకొన్న సంఘటనలో శ్రీనివాసులుకు తీవ్రగాయాలు కాగా విజయ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే ఇటీవలే మద్యం మత్తులో రోడ్డు డివైడర్‌ను ఢీకొని మృతి చెందిన వ్యక్తి వల్ల 19 మంది బస్సు దగ్ధంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలా జిల్లాలో ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

పోలీసుల వైఫల్యంతోనే..

ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు మాత్రం వీటిని నివారించడంలో విఫలం అవుతున్నారు. దీనికి కారణం పట్టణాలలో, పట్టణ శివారులలో పోలీసులు పర్యవేక్షణ లేకపోవడతో తూతూ మంత్రంగా డ్రంకెన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణాలలో వాహనదారులు, యువకులు నిత్యం అధిక వేగంతో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

దీనికి తోడు చాలా మందికి డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లే వాహనాలు నడపడం, ట్రిబుల్ రైడింగ్‌తో అతివేగంగా వెళ్లడం, ఇలా పర్యవేక్షణ లోపం కారణంగానే ఇంత మంది మృత్యువాత పడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం



రోడ్ల ప్రమాదాలకు కారణం వాహనదారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం. వాహనదారులు అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలకు కారణం అవుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో నిత్యం వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ ప్రతి రోజు దాదాపు 20 కేసులు నమోదు చేస్తున్నాం. వాహనాలు నడిపేటప్పుడు నియమిత వేగంతో, ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు సంభవించవు.

\- మొగులయ్య, డీఎస్పీ, గద్వాల

టోర్నీలో పతకాలు సాధించాలి

▸ జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్
▸ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు తరలిన క్రీడాకారులు


ఉమ్మడి జిల్లా యోగా క్రీడాకారులతో జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లాలో నేటి నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారులు తరలివెళ్లారు. శనివారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడారు. జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి బాలరాజ్, యోగా సంఘం సభ్యులు పాండురంగం, సూర్యప్రకాష్, కిషన్‌దాస్, కోచ్, మేనేజర్లు వెంకటేష్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ క్రీడలు

▸ పాల్గొన్న 13 గురుకుల పాఠశాలలు, కళాశాలల 1105 మంది విద్యార్థులు


లాగ్‌జంప్ చేస్తున్న విద్యార్థులు

అచ్చంపేటటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 11వ జోనల్ క్రీడలు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కొనసాగాయి. ముగింపు పోటీలు ఆదివారం ప్రిన్సిపాల్ బాలస్వామి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి 13 గురుకులాల పాఠశాలలు, కళాశాలల నుంచి 1105 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, లాంగ్‌జంప్. హైజంప్, ఖోఖో, ఫుట్‌బాల్, 100, 200, 600 మీటర్ల రన్నింగ్, చెస్ పోటీలను నిర్వాహకులు నిర్వహించారు. నిర్వహణ అధ్యక్షుడు వెం కటేశ్వర్లు, ఆర్గనైజర్ సెక్రటరీ ఆదిబాబు ఆధ్వర్యంలో వివిధ క్రీడలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

నిరంతరాయంగా కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 30వేల క్యూసెక్కుల వరద వస్తున్న కారణంగా ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో 8 యూనిట్లు ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా 3.766 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 493.676 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా 4.004 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 483.730 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు.

కడచూపునకు తోడ్పాటు

(5వ పేజీ తరువాయి)

ద్వారా వారి ఇంటికి చేర్చుతున్నారు. ఈమేరకు గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు 3,884 పార్థివ దేహాలను ఇళ్లకు చేర్చారు. అందులో మహబూబ్‌నగర్‌లో 1,425 మృతదేహాలను చేర్చగా, నాగర్‌కర్నూల్‌లో 1130, వనపర్తిలో 718, జోగుళాంబ గద్వాలలో 611 మృతదేహాలను వారి ఇళ్లకు తీసుకెళ్లారు.

బస్సు దగ్ధం ప్రమాదంలోనూ మన అంబులెన్స్‌లు..

ఇటీవల కర్నూల్ జిల్లాలో జరిగిన బస్సు దగ్ధం ఘటనలో ఉమ్మడి జిల్లాలోని 4 అంబులెన్స్‌లను అక్కడికి పంపించారు. వికారాబాద్ జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారి పార్థివ దేహాలను కూడా జిల్లా వాహనాల ద్వారా వారి ఇళ్లకు చేర్చారు. అత్యుత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు కూడా ఇచ్చారు.

ఇప్పటి వరకు 6 మృతదేహాలను తీసుకొచ్చారు..



మాది దేవరకద్ర మండలం అడివి అజిలాపూర్. మా గ్రామంలోని వారు ఎవరైనా ప్రభుత్వ ఆసుపత్రిలో చనిపోతే ఉచిత పార్థీవ వాహనాన్ని వినియోగించుకుంటాము. ఆసుపత్రిలోని ఆర్ఎంవోను కలిస్తే వాళ్లే అంబులెన్స్‌ను పంపిస్తున్నారు. ఈ ఉచిత పార్థీవ వాహనం నిరుపేదలకు ఉపయోగకరంగా ఉంది. ఇవి లేకుంటే లేదంటే బయటి అంబులెన్స్‌ల వారు వేల రూపాయలు డిమాండ్ చేసేవారు. ఇప్పటి వరకు మా గ్రామంలో 6 మృతదేహాలను ఈ వాహనాల్లోనే తీసుకొచ్చారు.

\- రాజుగౌడ్, అజిలాపూర్

అక్కమహాదేవి గుహల సందర్శనకు మరో లాంచీ

▸ నేటి నుంచి అందుబాటులోకి రెండు లాంచీలు

బ్రహ్మగిరి, న వంబరు 8 (ఆంధ్రజ్యోతి): న ల్లమల ప్రాంతాన్ని పర్యాటకంగా అభి వృద్ధి పరిచేందుకు తెలంగాణ ప్రభు త్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇం దులో భాగంగా శ నివారం మరో మి నీ లాంచీని బ్రహ్మగిరికి తీసుకొచ్చారు. అమ్రాబాద్ మండలం బ్ర హ్మగిరి నుంచి అక్కమహాదేవి గుహల సందర్శనకు ఇప్పటి వర కు ఒక్కటే మినీ లాంచీ ఉండేది. అక్కమహాదేవి గుహల సందర్శన కు రాను పోను సుమారు మూడు గంటల సమయం పడుతుంది. ఆ తరువాత వచ్చే పర్యాటకులు వేచి చూడకుండా ఉండేందుకు పర్యాటక శాఖ అధికారులు 30 మంది సామర్థ్యం గల మినీ లాం చీని బ్రహ్మగిరికి తీసుకువచ్చారు. రానురాను అక్కమహాదేవి గుహ ల సందర్శనకు తెలంగాణ ప్రాంతం నుంచే కాకుండా కర్ణాటక, మ హారాష్ట్ర ప్రాంతాల నుంచి పర్యాటకులు, భక్తుల సంఖ్య పెరుగు తున్నందున మరిన్ని వసతులు కల్పించేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టి పెట్టినట్లు పర్యాటక శాఖ జిల్లా అధికారి కల్వరాల నర్సింహ తెలిపారు.

ఒకే చోట ఏడు వానకోయిల పాములు

▸ ఇవి విషరహిత పాములు
▸ ప్రమాదం ఉన్నప్పుడు కలిసి ఉంటాయి
▸ సర్పరక్షకుడు డాక్టర్ సదాశివయ్య
▸ సురక్షితంగా పట్టుకున్న ఆయన శిష్యులు


జడ్చర్ల మండలం నసరుల్లాబాద్ గ్రామ సమీపంలో పట్టుకున్న ఏడు వానకోయిల పాములు

జడ్చర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం నసరుల్లాబాద్ గ్రామ సమీపంలో ఓ రైతు ఇంటి వద్ద బండ కింద ఒకే చోట ఏడు వానకోయిల పాములు కనిపించాయి. గ్రామానికి చెందిన రైతు కావలి యాదయ్య గ్రామ సమీపంలోని తన వ్యవసాయ పొలంలో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. మధ్యాహ్నం వేళ ఇంటి ప్రాంగణంలో ఒక పాము కనిపించింది. వెంటనే సర్పరక్షకుడు, జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సదాశివయ్యకు సమాచారం ఇచ్చాడు. ఆయన తన శిష్యులు రవీందర్, భరత్‌లను అక్కడికి పంపించాడు. బండ కింద పాము ఉన్నట్లు వారు గుర్తించారు. బండను జరిపి చూడగా, ఒకే చోట ఏడు పాములు కనిపించాయి. వాటిని జాగ్రత్తగా పట్టుకున్నారు. అర్థరోజైన్ ఫెసియోలేట శాస్త్రీయ నామం కలిగిన ఈ పాములు కొలుబ్రిడే కుటుంబానికి చెందినవని, ఇవి విషరహిత పాములని డాక్టర్ సదాశివయ్య తెలిపారు. ఈ జాతి పాములు సాధారణంగా రెండు కలిసి ఉంటాయని, అంతకంటే ఎక్కువ కలిసి ఉండటం అరుదని పేర్కొన్నారు. ఏదైన ప్రమాదం ఉన్నప్పుడు ఇవి ఒకే ప్రదేశంలో ఉండే అవకాశం ఉందన్నారు. ఆ పాములను జడ్చర్ల డిగ్రీ కళాశాలలోని జీవ వైవిధ్య సంరక్షణ విద్యా కేంద్రానికి తరలించారు. వాటిని సురక్షితంగా అడవిలో వదిలి పెడతామని చెప్పారు. పాములు కనిపిస్తే భయపడవద్దని, చంపవద్దని, తమకు సమాచారం ఇస్తే పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలి పెడతామని చెప్పారు.

సఖి కేంద్రానికి చేరిన చిన్నారులు


చిన్నారులను సఖి కేంద్రానికి తీసుకెళ్తున్న సిబ్బంది

కల్వకుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణానికి చెందిన రాములు చనిపోవడంతో ముగ్గురు పిల్లలు అనూష(4), కాసీం(3), కన్నయ్య, భార్య కప్పేర లక్ష్మిలు అనాథగా మారారు. ఉండడానికి ఇల్లు కూడా లేకుండా కల్వకుర్తి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో దినావస్థలో తిరుగుతున్నారు. గమనించిన పట్టణ బీజేపీ అధ్యక్షుడు గన్నోజు బాబీదేవ్ జిల్లా సఖి కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో సఖి కేంద్రం లీగల్ కౌన్సిలర్ టి.సరిత తన సిబ్బందితో వచ్చి లక్ష్మికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లితోపాటు ముగ్గురు చిన్నారులను జిల్లా సఖి కేంద్రానికి తీసుకెళ్లారు.

జడ్చర్లలో నకిలీ నోట్ల కలకలం

జడ్చర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్ట ణంలోని ఓ కాలనీలో నకిలీ నోటు కలకలం రేపింది. పట్టణంలోని ఓ కాలనీలో ఉన్న కిరాణం దుకాణంలో గత రెండు రోజులుగా రూ.500 నోటు ఇచ్చి సిగరె ట్లను కొనుగోలు చేస్తున్నాడు. ఆ నోట్లను కిరాణ దుకాణ యజమాని క్షుణ్ణంగా పరిశీలించగా అవి నకిలీవి గుర్తించాడు. శనివారం మధ్యాహ్నం సైతం ఆ యువకుడు రూ.500 నోటు ఇచ్చి సిగరెట్లు కొనుగోలు చేస్తుండగా కిరాణ దుకాణ యజమానితో పాటు స్థానికులు పట్టుకున్నారు. సదరు యువకుడి వద్ద ఉన్న రెండు రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

దర్జాగా కిరాయి దందా!

▸ దుకాణం ఒకరిది.. వ్యాపారం మరొకరిది..
▸ లీజ్‌దారులకు ఆదాయ వనరుగా వ్యవసాయ మార్కెట్ సముదాయాలు
▸ సబ్ లీజ్‌తో ప్రభుత్వ ఆదాయానికి గండి
▸ అంతా తెలిసినా పట్టించుకోని అధికారులు


పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ దుకాణాలు

పెబ్బేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుబంధ సంస్థల ఆస్తులు బినామీలకు ఆదాయ వనరులుగా మారాయి. వనపర్తి జిల్లా పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన అద్దె వ్యవహారంలో బినామీల దందా కొనసాగుతున్నది. దీంతో వాణిజ్య సముదాయాల పరిస్థితి "సొమ్ము ఒకరిది...సోకు మరొకరిది" అన్న చందంగా మారింది.

వ్యాపార సముదాయాలను తక్కువ ధరకు దక్కించుకున్న వారంతా ఇతర వ్యాపారులకు అధిక ధరలకు అద్దెలకు ఇస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఫలితంగా వ్యవసాయ మార్కెట్ ఖజానాకు భారీగా గండిపడుతుంది. ఈ సముదాయాలు అటు సంస్థలకు కాకుండా...ఇటు నిజంగా వ్యాపారం చేసుకునే వారికి కాకుండా టెండరులో దక్కించుకున్న వారికి దందాగా మారింది. ఈ తతంగం ఏళ్ల తరబడి నడుస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

వ్యవసాయ మార్కెట్ దుకాణాల వివరాలు..

పెబ్బేరు మునిసిపాలిటీలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో 28వ్యాపార దుకాణాల నిర్మాణం కోసం రూ.లక్షలు వెచ్చించి చేపట్టారు. వీటికి మార్చి 3, 2016లో ఎస్సీకి-4, ఎస్టీకి-1, బీసీకి-9, వికలాంగులకు-1, జనరల్‌కు-13 కేటగిరి ప్రకారంగా రిజర్వేషన్ టెండర్లు వేశారు. టెండరులో దుకాణాలను దక్కించుకున్న వారు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిపై రూ.లక్షల డిపాజిట్ చేయడంతో పాటు ఒకేసారి మూడు నెలల కిరాయి చెల్లించాలి. ప్రతీ నెల చెల్లిస్తున్న కిరాయికి ప్రతి సంవత్సరం 5శాతం కిరాయి పెరుగుతుంది. ప్రతీ రెండు సంవత్సరాలకు అగ్రిమెంట్ రెన్యువల్ చేసుకోవాలి. నిరుపేదలు, నిరుద్యోగుల జీవనోపాధి పెంపులో భాగంగా కేటాయించిన దుకాణాలను కొందరు బడాబాబులు సైతం రిజర్వేషన్ కేటగిరిలో పొందడం విడ్డూరం. వేలంలో దుకాణాలను దక్కించుకున్న కొందరు ఇతరులకు సబ్‌లీజుకు ఇచ్చి అక్రమంగా ఆదాయం అర్జిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

వ్యవసాయ మార్కెట్ ఆదాయానికి గండి

ఎస్సీ కేటగిరికి 4 షాపులుండగా ప్రతి నెల రూ.19,358 చెల్లించాలి. ఎస్టీ కేటగిరికి ఒక షాపు ఉండగా ప్రతీ నెల రూ.4,876, బీసీ కేటగిరికి 9షాపులుండగా ప్రతీ నెల రూ.69,611, జనరల్ కేటగిరికి 13షాపులుండగా ప్రతీ నెల రూ.97, 196 చెల్లించాలి. ఇలా 28షాపుల నుంచి ప్రతీ నెల రూ.2,02,164 అద్దె మార్కెట్ ఖజానాలో సమకూరుతుంది.

క్రమం తప్పకుండా ప్రతీ నెల అద్దె చెల్లించాలి. కానీ కొందరు రెండు, మూడు నెలలైనా అద్దె చెల్లించడం లేదనే సమాచారం తెలుస్తున్నది. దుకాణాలు పొందిన వారిలో 90శాతం మంది ఒక్కో దుకాణాన్ని రూ.4వేల నుంచి 9వేల వరకు టెండరులో దక్కించుకున్న వ్యక్తులు... ఇతర వ్యక్తులకు రూ.3వేల నుంచి రూ.7వేల వరకు అదనంగా అద్దె వసూళ్లు చేస్తూ అక్రమంగా దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అయితే లీజుదారులు సబ్‌లీజులకు ఇచ్చి దర్జాగా అదనపు సంపాదన వస్తున్న విషయం వ్యవసాయ మార్కెట్ అధికారులకు తెలిసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తవుతున్నాయి. అన్నీ తెలిసిన అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



వ్యవసాయ సముదాయ దుకాణాలను టెండరులో దక్కించుకున్న వారు ఇతరులకు లీజుకు ఇచ్చి అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే సమాచారం తెలిసింది. దీనిపై ఫిర్యాదు ఇస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటాం.

\- అనిల్ కుమార్, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, పెబ్బేరు

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


కొట్టం మౌలాలి(ఫైల్)

చిన్నంబావి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిన్నంబావి మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామానికి చెందిన తెలుగు కొట్టం పెద్ద మౌలాలి (59) చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మౌలాలి చేపల వల తీసుకుని గ్రామ సమీపంలోని పొలం దగ్గరికి శుక్రవారం మనుమడు కుమార్‌తో కలిసి వెళ్లాడు వరి పంటను పరిశీలించారు. ఆకలి అవుతుందని మనుమడు ఇంటికి బయలుదేరగా, మౌలాలి పక్కనే ఉన్న భీమా కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కాల్వ దగ్గరకు వెళ్లి చూడగా బీడీ కట్ట, అగ్గిపెట్టె, ఆ పక్కనే బట్టలు కనిపించాయి. చుట్టుపక్కల కాల్వలో వెతికారు. చీకటి పడటంతో ఇంటికి వచ్చారు. ఉదయాన కొంత దూరంలో చేపల వలలో ఇరుక్కున్న మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ వెంకట్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కాళ్లకు చుట్టుకుని నీటిలో మునిగి మృతి చెంది ఉండవచ్చునని తెలిపారు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్ఐ రాణి తెలిపారు.

రంగసముద్రం రిజర్వాయర్‌లో..


ఆంజనేయులు(ఫైల్)

శ్రీరంగాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు (35) రంగ సముద్రం రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ హిమబిందు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆంజనేయులు శనివారం తెల్లవారుజామున రంగసముద్రం రిజర్వాయర్ గేట్ల ముందు ఉన్న పెద్ద గుంతలో వలను తీయడానికి పోయి అక్కడే మునిగిపోయాడు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు చెప్పాడు. గ్రామస్థులతో కలిసి వచ్చిన వారు గుంతలో గాలించగా మృతదేహం బయటపడింది. వెంటనే ఎస్ఐకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

వాకింగ్ చేస్తున్న వ్యక్తిని ఢీకొట్టిన ఆటో

- ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే..


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుడుముల కృష్ణారెడ్డి

కల్వకుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వాకింగ్ చేసి వస్తుండగా ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తి గాయపడి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ-2 రాజశేఖర్ కథనం ప్రకారం.. కల్వకుర్తి పట్టణానికి చెందిన కుడుముల కృష్ణారెడ్డి(70) ప్రతీ రోజు ఉదయం వాకింగ్‌కు వెళ్తాడు. పట్టణ సమీపంలోని దేవరకొండ రోడ్డులో వాకింగ్ చేస్తున్న సమయంలో ఆటో వెనుక నుంచి ఢీ కొట్టింది.

ప్రమాదంలో కృష్ణారెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు వైద్యులు రెఫర్ చేశారు. ఈ క్రమంలో కడ్తాల సమీపంలోకి వెళ్లగానే కృష్ణారెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ-2 రాజశేఖర్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

జడ్చర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న జడ్చర్ల మండలం చాకలిగడ్డతండాకు చెందిన రమావత్ ఘాంసీరామ్(52)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గొల్లపల్లి, మాచారం గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... మాచారం గ్రామ సమీపంలోని ఓ కాంట్రాక్టర్ వద్ద ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఘాంసీరామ్ విధులు ముగించుకుని చాకలిగడ్డతండాకు నడుచుకుంటూ వస్తున్నాడు. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు వెల్లడించారు. ఘాంసీరామ్ భార్య కోమ్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

- ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు
- తప్పిన పెను ప్రమాదం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన విద్యార్థి

కొత్తకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను పాఠశాలకు తీసుకువస్తున్న ప్రైవేటు బస్సును లారీ ఢీకొనగా, పెను ప్రమాదం తప్పిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో నెలకొంది. శనివారం పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు రాయణిపేట గ్రామం నుంచి 27 మంది విద్యార్థులను ఎక్కించుకొని కొత్తకోటకు వస్తున్నది. మదర్ థెరిస్సా జంక్షన్ దాటిన వెంటనే కర్నూల్ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా తప్పించడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది.

ఆరుగురి విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిర్వహించి పాఠశాలకు తీసుకెళ్లారు. ఫిర్యాదు లేనందున కేసు నమోదు చేయలేదని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

మహిళపై హత్యాయత్నం

- నిందితుడి అరెస్టు

ఇటిక్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇటిక్యాల మండలం మొగలిరావుల చెర్వు గ్రామంలో మహిళపై దాడి చేసి పరారీలో ఉన్న నిందితుడిని శనివారం పోలీసులు అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. మొగలిరావులచెర్వుకు చెందిన ఎరుకలి వెంకట్రాముడు అదే గ్రామానికి చెందిన మహిళతో గత సెప్టెంబరు 13న అసభ్యకరంగా ప్రవర్తించి ఆమెపై కత్తితో దాడిచేసి పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిని శనివారం అరెస్టు చేసి అలంపూర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

ధరూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ధరూర్ మండల పరిధిలోని భీంపురం గ్రామంలో వ్యక్తిపై దాడి చేయగా గాయపడిన సంఘటన గురువారం చేటుచేసుకుంది. ఎస్ఐ కొండా శ్రీహరి కథనం మేరకు వివరాలిలా.. భీంపురం గ్రామానికి చెందిన నరేందర్‌పై అదే గ్రామానికి చెందిన హనుమంతు, అజయ్, విజయ్‌లు దాడి చేశారు.

గతంలో నరేందర్‌కు సంబంధించిన వరికోత మిషన్‌తో వారి పొలంలో పని చేయగా డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. దీంతో గురువారం ఉదయం నరేందర్‌పై ముగ్గురు కలిసి దాడిచేయగా అతను గాయపడ్డారు. ఈ విషయంపై నరేందర్ తండ్రి హనుమన్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


డబ్బింగ్ చెబుతున్న ఆద్య

ఆద్య గాత్రం...
వినసొంపైన వి'చిత్రం'!

సినిమాలో ఆ హీరోయిన్ గలగలమని మాట్లాడుతుంటే అందరూ ముగ్ధులవుతారు.. తెలంగాణ యాసలో మాట్లాడితే ఫిదా అవ్వాల్సిందే.. ఇప్పటికే ఆమె ఎవరో తెలిసిపోయింది కదూ.. ఆమే ప్రముఖ హీరోయిన్ సాయిపల్లవి... 'నీకంటే బెటరోణ్ణి మ్యాగీ చేసినంత ఈజీగా సెట్ చేసుకుంటా చూస్తుండు..' అని ఫిదాలో ఆమె చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నది. ఈ డైలాగ్ డబ్బింగ్ చెప్పింది ఆమె కాదు.. మన పాలమూరు బిడ్డ ఆద్య హనుమంతు. ఈయన పలు సినిమాల్లో లేడీ వాయిస్‌తో డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతున్నారు.

- సాయిపల్లవి గాత్రం వెనుక పాలమూరు గొంతుక
- సాయిపల్లవి.. సమంతతో పాటు ఎందరో హీరోయిన్లకు డబ్బింగ్ చెబుతున్న పాలమూరు బిడ్డ
- ఇప్పటికే 187 సినిమాలు.. 34 మంది హీరోయిన్లకు డబ్బింగ్ చెప్పిన ఆద్య
- త్వరలో రాబోయే పాన్‌ఇండియా మూవీ రామాయణంలోనూ ఛాన్స్..!
- పాలమూరులో డబ్బింగ్ స్టూడియో ఏర్పాటు.. ఈనెల 15 నుంచి తరగతులు

మహబుబూబ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంతో అందంగా తన గాత్రంతో ప్రేక్షకులను కట్టిపడేస్తున్న సాయిపల్లవి గాత్రం వెనుక మన పాలమూరు బిడ్డ గొంతుక ఉన్నదన్న విషయం ఎవరికీ తెలియని నిజం. అదికూడా అమ్మాయిలకు అబ్బాయి డబ్బింగ్ చెబుతున్నారంటే ఎవరైనా నమ్ముతారా? పాలమూరుకు చెందిన డబ్బింగ్ ఆర్టిస్ట్ డాక్టర్ ఆద్య హనుమంతు ప్రముఖ హీరోయిన్ సాయిపల్లవి, సమంతతో పాటు ఎంతోమందికి తన గాత్రాన్ని అందిస్తున్నారు. తెర ముందు అందమైన భామలచేత ముద్దుముద్దు మాటలను తెరవెనుకనుంచి పలికిస్తున్న డబ్బింగ్ ఆర్టిస్ట్ ఆద్య శనివారం మహబూబ్‌నగర్‌కు వచ్చిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ఆయనను పలకరించింది. 23 ఏళ్ల యువకుడు ఎంతోమంది హీరోయిన్లకు గొంతుకగా మారారంటే ఆశ్చర్యమనిపిస్తోంది కదూ.

పాలమూరులో పుట్టి కర్ణాటకలో స్థిరపడి...

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండ ప్రాంతానికి చెందిన హొన్నప్ప, మహిమ దంపతుల కుమారుడు ఆద్యహనుమంతు ఇక్కడే ఐదోతరగతి వరకు విద్యను అభ్యసించారు. ఆ తరువాత కుటుంబం కర్ణాటక రాయచూర్‌లో స్థిరపడటంతో అక్కడే చదువుకున్నాడు. ఎంబీబీఎస్ సైకియాట్రి ఎంచుకున్న ఆయన ప్రస్తుతం సైకియాట్రిలో పీజీ చేస్తున్నారు. ఓవక్క మెడిసిన్ చదువుతూ మరోపక్క డబ్బింగ్ చెప్పడం అలవాటు చేసుకున్నాడు. డబ్బింగ్‌తో పాటు ప్లేబ్యాక్ సింగర్‌గానూ రాణిస్తున్నారు.

తన గొంతు కొంత ఆడపిల్లలా ఉండటంతో మొదట్లో కొంత ఇబ్బందిపెట్టినా ఇప్పుడు అదే అతనికి వరమైంది.. పాఠశాలలో చదువుకునే రోజుల్లో సీరియల్స్‌లో చైల్డ్ ఆర్టిస్టలకు డబ్బింగ్ చెప్పే అవకాశం వచ్చింది. ఆ తరువాతి రోజుల్లో చిన్నారి పెళ్లికూతురు సీరియల్‌లో ఆనంది క్యారెక్టర్‌కు డబ్బింగ్ ఇచ్చారు. తరువాత అదే వాయిస్ సినిమాల్లో హీరోయిన్లకు కనెక్ట్ అవడంతో అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూడలేదు. కొద్ది రోజుల్లోనే సెలబ్రిటీగా మారిపోయారు.

పాలమూరులో డబ్బింగ్ స్టూడియో...

తను ఎక్కడికెళ్లినా కర్ణాటక వాసిగా ప్రచారం చేస్తున్నారు. అందుకే తను పుట్టిన పాలమూరు గడ్డలోనే తనలా మరెందరో ఆర్టిస్టలను తయారు చేయాలని ఇక్కడే డబ్బింగ్ స్టూడియోను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆద్య తెలిపారు. ఇప్పటికే పాలకొండ సాయిబాబ ఆలయం ఎదురుగా ద్వారకానగర్‌లో స్టూడియోను ఏర్పాటు చేసుకుంటున్నాం.

ఈనెల 15నుంచి 20 మందితో తొలిబ్యాచ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. కొన్ని తరగతులు ఆన్‌లైన్‌లో.. మరికొన్ని తరగతులు నేరుగా తీసుకోనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, అక్కడ డబ్బింగ్, కెమెరా, ఎడిటింగ్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.


హీరోయిన్ సాయిపల్లవితో డబ్బింగ్ ఆర్టిస్ట్ ఆద్య (ఫైల్)

34 మంది హీరోయిన్లకు డబ్బింగ్

తెలుగుతో పాటు తమిళం, మళయాళం, కర్ణాటకలో 34 మంది హీరోయిన్లకు గాత్రం అందించారు. 2013నుంచి ఇప్పటివరకు 187 సినిమాల్లో డబ్బింగ్ చెప్పారు. సాయిపల్లవికి మొదటినుంచి ఆద్యనే గాత్రం అందిస్తున్నారు. సమంతకు మాత్రం కొన్ని సినిమాల్లో డబ్బింగ్ ఇచ్చారు. త్వరలో తెరకెక్కనున్న పాన్ ఇండియా మూవీ రామాయణం సినిమాలో సాయిపల్లవి సీత క్యారెక్టర్ చేయబోతున్నారు. ఈ సినిమాలోనూ సాయిపల్లవికి మన పాలమూరు బిడ్డ ఆద్యా హనుమంత్ గాత్రం అందించే అవకాశం ఉంది. అమ్మాయిలకు అబ్బాయి డబ్బింగ్ చెప్పడమే విశేషమైతే.. అమ్మాయిల ఏమోషనల్ క్యారెక్టర్‌లు, ఏడుస్తున్న దృశ్యాలకు డబ్బింగ్ చెప్పడమనేది అంత ఈజీ కాదు.

ఇదే విషయమై ఆద్యను అడిగినపుడు ఆ సమయంలో తాను డబ్బింగ్ చెబుతున్నానన్న విషయాన్ని మరిచిపోయి క్యారెక్టర్‌లోకి పరకా యప్రవేశం చేయాల్సి ఉంటుందని, అలా చేస్తేనే ఆ సన్నివేశానికి గాత్రం సరిపోతుందని తెలిపారు. తను చేస్తున్న క్యారెక్టర్ మనది అని ఫీల్ అయినపుడే ఎలాంటి సిచ్యూవేషన్ సీన్‌లోనైనా చేసే డబ్బింగ్‌కు న్యాయం జరుగుతుందని వివరించారు. చదువంటే తనకు ప్రాణమని, డబ్బింగ్ పేరిట చదువును నిర్లక్ష్యం చేయబోనని స్పష్టం చేశారు.

అభయుడి ఆలయానికి కార్తీకశోభ

ఊర్కొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అభయాంజనేయస్వామి వారి ఆలయానికి శనివారం కార్తీకశోభ సంతరించుకుంది. భక్తుల సందడితో ఆలయ పరిసరాలు కిక్కిరిసి జైహనుమాన్ నామ స్మరణతో మారుమోగాయి. కార్తీకమాసం పురస్కరించుకొని భక్తులు దీపారాధన అనంతరం సామూహిక వ్రతాలు నిర్వహించి అన్నదానం చేశారు. పాలకమండలి, ఆలయం సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అంతకుముందు అర్చకులు స్వామివారికి తెల్లవారుజామున అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి దర్శనం కల్పించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలుచున్నారు. అర్చకులు దత్తాత్రేయశర్మ, ప్రవీణ్‌శర్మ, మహేష్‌శర్మ, శ్రీనివాసశర్మలు పూజలందించారు.


ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో కిక్కిరిసిన భక్తులు

శాస్త్రోక్తంగా కార్తీక సత్యనారాయణ స్వామి వ్రతాలు


పాలెం వెంకన్న ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు కార్తీక సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజచార్యులు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 108 మంది దంపతులు సామూహిక వ్రతాలు చేయగా, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులకు బాలాజీ అన్నదాన సత్రం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అర్చకులు జయంత్, శుక్లా, అరవింద్, చక్రపాణి, డాక్టర్ గోపాల్, సురేందర్, శేఖర్, సుబ్రమణ్యం, సూర్యకళ, శివుడు, శైలజ, ఆలయ సిబ్బంది శివకుమార్, పురుషోత్తం, బాబయ్య, జగదీష్ తదితరులు ఉన్నారు.

డిండి ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి

- వరుస సెలవులతో పర్యాటకులతో బిజీగా మారిన జాతీయ రహదారి
- రెండు నెలలుగా దుందుభీ పరవళ్లు


డిండి అలుగుపై నుంచి జాలువారుతున్న జలపాతాన్ని సెల్ఫీ తీసుకుంటున్న సందర్శకులు

అచ్చంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత రెండు నెలలుగా దుందుభీ నది ప్రవహిస్తుండడంతో డిండి ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంటోంది. 765 జాతీయ రహదారిపై డిండి ప్రాజెక్టు ఉండడంతో సెలవుదినాలలో శ్రీశైలం-హైదరాబాద్ వెళ్లే పర్యాటకులు, భక్తులు డిండి పరవళ్లను ఆస్వాదిస్తూ తమ మొబైల్ ఫోన్లలో బంధించుకుంటూ సెల్ఫీలు దిగుతున్నారు. ఈ దారి గుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున్న శ్రీశైలం వెళ్లే భక్తులు డిండి అందాలను చూసేందుకు ఆసక్తి కనబరుస్తారు.

చేపల ఫ్రై ఘుమఘుమలు..

డిండి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు డిండి వద్ద లభించే చేపలంటే ఎంతగానో ఇష్టపడతారు. కొందరు ప్రత్యేకంగా డిండి చేపల కోసమే స్నేహితులతో కలిసి వచ్చి ఇక్కడే విడిది చేస్తారు. ఈ క్రమంలో ప్రాజెక్టు సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా చేపల ఫ్రై దుకాణాలు వెలిశాయి. నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో ఉన్న వైజాగ్ కాలనీని తలపించేలా డిండి అలుగు ప్రాంతంలో స్నేహితులు, బంధుమిత్రులతో జలపాతాలను తిలకిస్తూ చేపల ఫ్రైతో విందు, వినోదాలు జరుపుకుంటారు.

సంగంబండ రిజర్వాయర్ గేటు మూసివేత

మక్తల్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం గేటును అధికారులు శనివారం మూసివేశారు. ఎగువ నుంచి పెద్దవాగుకు వరద నీటి ఉధృతి తగ్గడంతో గేటును మూసివేశారు. జలాశయం రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.65 టీఎంసీలు మాత్రమే ఉందని ఇరిగేషన్ డీఈఈ సురేష్ తెలిపారు.

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తిల తైల అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. మండలంలోని నందివడ్డెమాన్ నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రంతో పూజలు చేశారు. భక్తులకు తాగునీటి వసతి, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటి చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. పూజారులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, రాజేష్, శ్రీకాంత్ రెడ్డి, ప్రభాకర్, పుల్లయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో సినీనటుడు అల్లు అర్జున్

- కుటుంబ సభ్యులు, చిన్ననాటి మిత్రులతో కలిసి కృష్ణానది అందాల వీక్షణ
- కృష్ణానదిలో బోటింగ్ చేసిన హీరో
- పుష్ప కోసం సోమశిలకు పరుగెత్తిన అభిమానులు
- అప్పటికే వెళ్లిపోయిన అల్లు అర్జున్
- రాత్రి కుడికిళ్ల గ్రామంలోని ప్రముఖ వ్యాపారవేత్త నివాసంలో బస


సోమశిల వద్ద కృష్ణానదిని సందర్శించిన సినీనటుడు అల్లు అర్జున్

కొల్లాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిత్యం సినిమా షూటింగ్‌లతో బిజీగా గడిపే ప్రముఖ సినీనటుడు అల్లు అర్జున్ తన కుటుంబ సభ్యులు, చిన్ననాటి మిత్రులతో కలిసి శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామం దగ్గర కృష్ణానదిని గోప్యంగా సందర్శించారు. ఆహ్లాదంగా ఉండే కృష్ణానదిలో సరదాగా బోటింగ్ చేశారు.

శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో సోమశిల గ్రామానికి అల్లు అర్జున్ తన సతీమణి, కుటుంబ సభ్యులు, చిన్ననాటి మిత్రులతో కలిసి వచ్చారు. ఎవరు గుర్తుపట్టకుండా టోపీ, మాస్క్ ధరించి సామాన్య వ్యక్తిలా నిండు కుండలా ప్రవహిస్తున్న కృష్ణానదిలో ఆహ్లాదకరంగా రెండు గంటల పాటు గడిపారు. సోమశిల గ్రామానికి పుష్ప వచ్చాడని సోషల్ మీడియా ద్వారా తెలిసి అభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో సోమశిల గ్రామానికి పరుగులు తీశారు. అప్పటికే ఆయన వెళ్లిపోవడంతో అభిమానులు నిరుత్సాహం గా వెనుతిరిగారు. అల్లు అర్జున్ మాత్రం మిత్రులతో కలిసి అక్కడి నుంచి కొల్లాపూర్ మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామంలో ప్రముఖ వ్యాపారవేత్త మైహోమ్ అధినేత రామేశ్వరరావు నివాస గృహానికి చేరుకొని అక్కడే రాత్రి బస చేశారు.

ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారని తెలిసింది. కుడికిల్ల గ్రామానికి అల్లు అర్జున్ వచ్చారని ఎవరికీ తెలియ కుండా గోప్యంగా ఉంచారు.

మొరం టిప్పర్‌ను పట్టుకున్న పోలీసులు

ఊట్కూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా అక్రమంగా మొరంను తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం సాయంత్రం వల్లంపల్లి శివారులో పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఊట్కూర్ ఎస్ఐ రమేష్ వివరాల ప్రకారం.. దామరగిద్ద మండలం నుంచి టిప్పర్‌లో మొరం తరలిస్తుండగా, ఊట్కూర్ మండలం వల్లంపల్లి గ్రామ శివారులో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. టిప్పర్‌లో మొరం ఉండటంతో అనుమతి పత్రాలను అడుగగా, ఏవీ లేకపోవడంతో ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ బి.శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మేకల మందలో మమేకమై..

- జాతులు వేరైనా ఆరు నెలలుగా కలిసి సాగుతూ..
- వత్తుగుండ్ల తండాలో శ్రీనునాయక్ మేకల మందలో జింకపిల్ల



వత్తుగుండ్ల తండాలో మేకలతో కలిసి మేసేందుకు వెళ్తున్న ఓ జింక పిల్ల

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరుగులు పెట్టే ఓ జింక పిల్ల ఏకంగా ఆరు నెలలుగా మేకల మందతో కలిసిపోయింది. జాతులు వేరైనా జోడిగా బతుకు బండిని నెట్టుకొస్తున్నది. ఇదెక్కడో కాదు నారాయణపేట జిల్లాలోని దామరగిద్ద మండలం వత్తుగుండ్ల తండాకు చెందిన శ్రీనునాయక్ మేకల మందలో కానవచ్చింది. ఆరు నెలల కిందట జింకపిల్ల చిన్నగా ఉన్న సమయంలో మేకలు మేపుకోసం అటవీ ప్రాంతానికి వెళ్లగా కుక్కలు వెంబడించడంతో జింక పిల్లను రక్షించానని శ్రీను తెలిపారు. తమ తోటి మేక పిల్లలతో కలిపి.. ఓ మేక పిల్ల పాలు తాపుతూ వచ్చాను. పెద్దదై మేకలతో ఆ జింక కలిసిపోయింది. నిత్యం గుట్ట ప్రాంతాలకు తమ మేకలతో కలిసి జింక కలియదిరిగి చీకటి పడితే చాలు వత్తుగుండ్లతండాకు చేరుకుంటుందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆయుర్వేద వైద్యంతోనే రోగానికి శాశ్వత పరిష్కారం

● మండల ఆయుర్వేదిక్ ఆసుపత్రి డాక్టర్ సుధారాణి



ఊట్కూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోగానికి శాశ్వత పరిష్కారం ఆయుర్వేదంలోనే లభిస్తుందని చిన్నపొర్ల ఆయుష్ ఆయుర్వేదిక్ ఆసుపత్రి డాక్టర్ సుధారాణి అన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు.

ప్రజలు ఆయుర్వేద వైద్యం పట్ల ఎందుకు ఆసక్తి చూపడం లేదు?

ఆయుర్వేద వైద్యంతో రోగం తొందరగా నయం కాదనే అపోహ ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆసక్తి చూపడం లేదు. పట్టణాల్లో ఇప్పుడు ప్రజలు ఆయుర్వేదం, యునానీ, హోమియోపతి, ప్రకృతి చికిత్సలపై ఆసక్తి పెంచుకుని చికిత్స చేయించుకుంటున్నారు.

గతానికి, ప్రస్తుతం ఆయుర్వేద వైద్య చికిత్సలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

గతంలో పొడి రూపంలో రోగికి మందు ఇచ్చి నీళ్లల్లో కలుపుకొని తాగమని చెప్పేవారం. మందు చేదుగా అనిపించడంతో పాటు ఎక్కడికైనా తీసుకెళ్లాలంటే ఇబ్బంది పడేవారు. కానీ ఇప్పుడు ప్రతీ మందు మాత్రల రూపంలో వచ్చాయి.

అయుష్ ద్వారా ఎన్నిరకాల చికిత్సలు అందుతున్నాయి?

ఆయుర్వేదంతో పాటు పంచకర్మ చికిత్సలు, యోగా, యూనానీ, హోమియోపతి, కప్లింగ్ పద్ధతిలో కూడా చికిత్సలు అందిస్తున్నాం.

ఎలాంటి సమస్యలతో ప్రజలు ఎక్కువగా ఆసుపత్రికి వస్తారు?

ప్రస్తుతం గ్యాస్ సమస్య, నొప్పులు, రక్తహీనత, షుగర్, బీపీ గల వాళ్లు అధికంగా వస్తున్నారు. రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో కొంత ఇబ్బంది అవుతోంది.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ట	కనిష్ట
		(రూపాయలలో)	
వడ్లు హంస	256.20	2,689	1,750
వడ్లు సోన	352.80	2,269	2,060

న్యూస్ బాక్స్

నేడు మాతా మాణికేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట శివారు పగిడిమర్రి మార్గంలోని మాతా మాణికేశ్వరి ఆలయంలో ఆదివారం ఆలయ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని అమ్మ ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు హాజరై మాత కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేటి నుంచి అవధూత స్వామి ఆరాధనోత్సవాలు

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట సుభాష్‌రోడ్‌లో గల సద్గురు అవధూత నర్సింహస్వామి 134వ ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు మఠం కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు జరగనున్నాయి. ఇప్పటికే మఠానికి రంగులు వేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయాలి

కృష్ణ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా మార్చాలని, జీవో నెం.34ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పేట కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల కేంద్రంలో ఎన్‌ఆర్‌పీడీ పోస్టర్‌ను విడుదల చేసి, మాట్లాడారు. సంఘం కార్యదర్శి వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

16న భగవద్గీత కంఠస్థ పోటీలు

మక్తల్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ శాఖల ఆధ్వర్యంలో ఈనెల 16న సత్యసాయి మందిరంలో పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత 6వ అధ్యాయంపై శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించనున్నామని వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, భజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజక్ భీమేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకోవాలన్నారు.

ఏడు క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేయాలి

మరికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొంటామని సీసీఐ పేర్కొన్న నిబంధనను ఎత్తివేసి గతంలో మాదిరిగానే కొనుగోలు చేయాలని సీపీఐ నాయకుడు వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధిక వర్షాల కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.

మురుగుతో ఇబ్బందులు

» పట్టించుకోని పంచాయతీ అధికారులు



ఎస్సీ కాలనీలో ఏర్పడిన మురుగునీటి గుంత

గుండుమాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ నాలుగో వార్డులో ఏర్పడిన మురుగుతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని ఇళ్ల నుంచి వచ్చిన మురికినీరు ఒక చోటుకు చేరి మురికికుంట మాదిరిగా తయారైంది. దీంతో కాలనీవాసులు పంచాయతీ అధికారులకు పలు మార్లు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఏర్పడిన మురుగుతో దోమలు, ఈగలే కాకుండా ఒక్కోసారి పాములు సైతం ఇళ్లల్లోకి వస్తున్నాయని వారు పేర్కొన్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే చాలామంది రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ రోజంతా కష్టపడిన డబ్బులు మొత్తం వాటికే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మురుగును బయటికి పారదోలేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇంట్లోకి పాములు వస్తున్నాయి..



గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు తెలియజేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మురికి కుంట మా ఇంటికి ఆనుకొని ఉండడంతో ప్రతీరోజు ఇంట్లోకి పాములు వస్తున్నాయి. ఇప్పటికే దోమలు, ఈగలతో ఇబ్బందులు పడుతున్నాం.

- కృష్ణయ్య

ఘనంగా ముఖ్యమంత్రి జన్మదినం

» బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

» కేక్ కట్ చేసిన కాంగ్రెస్ నాయకులు



కోస్గిలో కేక్ కట్ చేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్ రూరల్/నారాయణపేట/కోస్గి రూరల్/మరికల్/ఊట్కూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం పశు సంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. పార్టీ నాయకులు పూజ శివ, చెన్నయ్యసాగర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

అదేవిధంగా, నారాయణపేట సీవీఆర్ బంగ్లాలో సీఎం జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి, ప్రసంగించారు. మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం, ఆర్టీవో బోర్డు సభ్యుడు పోషల్ సంతోష్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహిముద్‌ఖురేషి, మాజీ కౌన్సిలర్ అమిరొద్దీన్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూదన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తా వద్ద సమావేశమైన కాంగ్రెస్ నాయకులు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.

మరికల్ పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హరీశ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అంతకుముందు పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో సీఎం పేరుపై అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వీరన్న, ఎల్.రాములు, రామకృష్ణారెడ్డి, చెన్నయ్య తదితరులున్నారు.

ఊట్కూర్ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు సూర్యప్రకాశ్‌రెడ్డి, మణెమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డిలు చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోరం మహేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొక్కు లింగం, నాయకులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల ఏర్పాటుతో రైతాంగానికి ఊరట

» జిల్లాలో ఏడు కేంద్రాలు

» 1364 మంది రైతులతో 28003 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసిన సీసీఐ

» ప్రైవేటు మిల్లుల్లో 12637 క్వింటాళ్ల కొనుగోలు

» అధిక తేమతో కర్షకుల కష్టాలు



ఊట్కూర్ మండలం తిప్రస్‌పల్లి మిల్లు వద్ద బారులు దీరిన పత్తి వాహనాలు (ఫైల్)

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం మాగనూర్ మండలం వడ్వాట్, దామరగిద్ద మండలం ఉలిగుండం మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అయితే ఇప్పటికే ఎల్-1, ఎల్-2 పత్తి మిల్లులకు అనుమతి లభించగా ఐదు మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం కాగా తాజాగా ఎల్-3 వడ్వాట్, ఎల్-4 ఉలిగుండం మిల్లుల్లో పత్తి సీసీఐ కొనుగోళ్లు ఎట్టకేలకు ప్రారంభం కావడంతో రైతాంగానికి ఊరట లభించింది. అయితే కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్‌లతో పాటు, వర్షాలు అడపాదడపగా కురుస్తుండటంతో తేమ శాతం పెరిగింది. దీంతో పాటు సీసీఐ కొనుగోళ్లకు నిబంధనల అడ్డుతో కర్షకులు పాట్లు పడుతున్నారు. తేమ 8 నుంచి 12 శాతంలోపు ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేసి క్వింటాల్‌కు ప్రభుత్వ మద్దతు ధర రూ.8,111 చెల్లిస్తోంది. నిబంధనల కొర్రీతో రైతులు ప్రైవేటు మిల్లుల్లో తక్కువ ధరకే పత్తిని విక్రయించుకుంటూ నష్టపోతున్నారు. క్వింటాల్ కనిష్ట ధర రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు లభిస్తుండడంతో వచ్చిన ధరకే పత్తిని విక్రయిస్తున్నారు. అక్టోబరు 22 నుంచి నవంబరు 4వ తేదీ వరకు జిల్లాలోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో 1,364 మంది రైతులతో 28003.9 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఇక ప్రైవేటులో మిల్లర్లు 12637.9 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేశారు.

పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి



పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం

మక్తల్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు అందించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆ సంఘం అధ్యక్షుడు బి.గోపాలం, కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రతీనెల రెండవ శనివారం జరిగే పెన్షనర్ల సమావేశంలో భాగంగా మక్తల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత బెనిఫిట్స్ అందించాలని, పెండింగ్ డీఏలు, పీఆర్సీతో పాటు నగదు రహిత వైద్య చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సంఘం కోశాధికారి సిద్ధ లింగయ్య, సూర్యప్రకాశ్, సంజన, కిష్టయ్యగౌడ్, సుజాత, అరుణ, విద్యావతి, గోపాల్, కృష్ణయ్య ఉన్నారు.

సన్న బియ్యం బ్యాగులు పంపిణీ

ఊట్కూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే పేదలకు రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వం తరఫున రేషన్ బియ్యం తీసుకోవడానికి తయారుచేసిన చేతి సంచులను వారు పంపిణీ చేసి, మాట్లాడారు. గత పదేళ్ల నుంచి రాని రేషన్‌కార్డులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలందరికీ వచ్చాయని అన్నారు. పేదల ఆకలి బాధలు తెలిసిన ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోరం మహేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొక్కులింగం, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



కృష్ణలో కనకదాస విగ్రహానికి పూజలు చేస్తున్న కుర్వ సంఘం నాయకులు

కృష్ణ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కనకదాస 538వ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి కుర్వ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు మహాలింగ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం దర్వాడ్ జిల్లా బాధ అనే గ్రామానికి చెందిన తిప్పప్ప చిన్నతనంలో భక్తి భావాలు కలిగిన కనకదాసు కనకచాలా లక్ష్మీ దేవత కనకదాసగా పేరు మార్చుకొని రచనలు, ప్రవచనాలు, కీర్తనలు, సంగీత రచనలు కన్నడ భాషలో రచించి పేరు పొందాయన్నారు. కనకదాసు రచనలు సామాజిక అసమానతలను ఖండించి మానవత్వం, ప్రేమ నిస్వార్థ భక్తిని చాటాయన్నారు. మాజీ ఉప సర్పంచ్ సురేష్‌కుమార్, బాలరాజు, శివరాజ్‌పాటిల్, యాంకన్నగౌడ, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణగౌడ్‌తో పాటు, వివిధ గ్రామాల మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే, హిందూపూర్ గ్రామంలోని బీర లింగేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో కనకదాసు చిత్రపటానికి మాదారి, మాదాసి కురువలు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంతపూజారి, లక్ష్మణ పూజారి, బీరప్ప, కిరప్ప, మహా లింగరాయ, సబన తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండలం సింగారంలోని 11 కేవీ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రామీణ విద్యుత్ ఏఈ సాయినాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, శేర్నపల్లి ఫీడర్ కింద ఉన్న విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలడంతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నందున మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ శేర్నపల్లికి విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు గమనించి అంతరాయానికి సహకరించాలని ఏఈ సాయినాథ్‌రెడ్డి కోరారు.

నారాయణపేట పట్టణంలో..

నారాయణపేట పట్టణంలో ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ సివిల్-1, 11 కేవీ చిల్డ్రన్స్ ఆసుపత్రి వరకు ఫీడర్‌లో మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ మహేష్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు సైన్స్, మూఢనమ్మకాలపై సదస్సు

మక్తల్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పెరిగిపోతున్న మూఢనమ్మకాలకు అడ్డుకట్ట వేసే దిశగా అందరూ కలిసి రావాలని నాస్తిక సమాజం జిల్లా నాయకుడు పోలప్ప పిలుపునిచ్చారు. ఆదివారం పాలమూరులోని టీఎన్‌జీవో భవన్‌లో సైన్స్ మూఢనమ్మకాలపై సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. అంతరిక్ష పరిశోధనలు చేసేవరకు మనుషులు ఎదిగినా మూఢనమ్మకాలు ఇంకా వీడిపోలేదని, సదస్సులో అందరూ పాల్గొని ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి చంద్రశేఖర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, నాయకులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

» ట్రాఫిక్ ఎస్‌ఐ కృష్ణచైతన్య



బాలుడి తల్లికి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ కృష్ణచైతన్య

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన ట్రాఫిక్ ఎస్‌ఐ కృష్ణచైతన్య తల్లిదండ్రులు, మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, అవగాహన లేమితో వారు డ్రైవింగ్ చేసి ఇతరులకు కూడా ఇబ్బందులు కలిగించి రోడ్డు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు చట్టప్రకారం తల్లిదండ్రులను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కన్మనూర్‌లో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి రమేష్

మరికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కన్మనూర్ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు శనివారం వేగవంతమయ్యాయి. గ్రామంలోని ప్రధాన రహదారి డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. పనులను పంచాయతీ కార్యదర్శి రమేష్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పౌరుడు తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం బాధ్యతగా భావించాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం మానుకోవాలన్నారు. గృహ యాజమానులు, వ్యాపారులు తమ ఇళ్లు, దుకాణాలకు సంబంధించిన చెత్తను పంచాయతీ ట్రాక్టర్లకు అందించాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు రావన్నారు.

రైతులకు బోనస్ ఎప్పుడిస్తారు..

నర్వ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సన్న వడ్లకు సంబంధించి రైతులకు రూ.500 బోనస్ ఎప్పుడు ఇస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా పరిపాలన కొనసాగిస్తోందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తేనే అన్ని పథకాలు అమలవుతాయని లేకుంటే ఆఫ్ చేస్తామని పేర్కొనడం దారుణమన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. నర్వ నుంచి రాంపూర్ గేట్ డబుల్ రోడ్డు వేయిస్తామని చెప్పి రెండు నెలలు గడుస్తున్నా రోడ్డు గురించి పట్టించుకోలేదన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్‌సింహారెడ్డి, నాయకులు నిరంజన్, హన్మంత్‌రెడ్డి, రిటైర్డ్ ఆర్మీ హన్మంత్, దాసరి కొండన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి

» ఆలయంలో కంటి వైద్య శిబిరం, చీరల పంపిణీ



పేట సత్యసాయిబాబా ఆలయంలో చీరలు పంపిణీ చేసిన నాయకులు

నారాయణపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట సత్యసాయి మందిరంలో శనివారం సత్యసాయిబాబా శత జయంతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం వెంకటేశ్వర ఆసుపత్రి డాక్టర్ గగన్ ఆధ్వర్యంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని హరినారాయణ భట్టడ్ ప్రారంభించారు. అలాగే వందమంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నందునామాజీ, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు గందెచంద్రకాంత్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ చిట్టెం మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి మిత్రుల చేయూత



మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి నగదును అందిస్తున్న స్నేహితులు

ఊట్కూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమతో పాటు చదువుకున్న స్నేహితుడి మృతితో ఇబ్బంది పడుతున్న కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించారు. పట్టణంలోని శ్రీరాంనగర్ వీధికి చెందిన లావరి రామకృష్ణ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2005-06 విద్యా సంవత్సరానికి చెందిన డిగ్రీ మిత్రులు శనివారం మృతుడి భార్య లక్ష్మికి రూ.30 వేల నగదు అందించారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులను గ్రామస్థులు అభినందించారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ గ్రామసభలు



తిప్రస్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న సామాజిక తనిఖీ గ్రామసభ

ఊట్కూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులపై ప్రతీ సంవత్సరం నిర్వహించే సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ స్థాయి విచారణ గ్రామసభలు మండలంలో కొనసాగుతున్నాయి. శనివారం మండలంలోని తిప్రస్‌పల్లి, కొత్తపల్లి, అవుసులోన్‌పల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో చేపట్టిన పనులు, వివరాలను ప్రజల ముందు అధికారులు చదివి వినిపించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు కూలీలు పని చేసిన వివరాలు, వారి వేతనం, పనిచేసిన దినాలను వివరించారు. గ్రామసభల్లో ఎస్‌ఆర్పీ కుమార్ ఈసీ మహిపాల్ రెడ్డి, టీఏలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా సప్త శక్తిసంఘ్

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళా లోకంలో చైతన్యం పెంచే దిశగా గుడిపల్లి మంజుల అధ్యక్షతన శనివారం స్థానిక శ్రీసరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో సప్త శక్తిసంఘ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్నుద్ధేశించి పలువురు మాట్లాడుతూ స్త్రీలో ఉన్నటువంటి ఏడు శక్తులను నివురు గప్పిన నిప్పులా మేల్కొలిపే విధంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి కుంటి ఎల్లప్ప, పాఠశాల జిల్లా అధ్యక్షుడు జి.బాలరాజు, సహ కార్యదర్శి పి.శ్రీనివాస్‌రెడ్డి, పరిషత్ కన్వీనర్ లక్ష్మయ్య గౌడ్, వక్తలు, ఆచార్యులు, పోషకులు పాల్గొన్నారు.